యుక్త వయస్సులోనూ పక్షవాతం

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- ముందుగా గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు
- జీజీహెచ్‌లో స్ట్రోక్ బాధితులకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం

'సుబ్బారావుకు 33 ఏళ్లు. ఊరు నరసరావుపేట. పనులపై గుంటూరు వచ్చాడు. ఓ షాపింగ్‌మాల్ వద్ద సడన్‌గా కుప్పకూలిపోయాడు. వైద్యశాలకు తరలించారు. వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌గా నిర్ధారణ చేశారు.' అతడు మృతి చెందడంతో బంధువులకు సమాచారం అందించారు.

'బాపట్ల జిల్లాకు చెందిన శ్రీనివాస్‌కు ఆరు నెలల క్రితం క్రితం పక్షవాతం వచ్చింది. వైద్యం చేయించుకోలేదు. ఆకుపసరు తీసుకుని మిన్నకుండిపోయాడు. వ్యాధి తగ్గక పోగా శాశ్వత అంగవైకల్యానికి గురయ్యాడు. వికలాంగుల సర్టిఫికెట్ కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు'. 80 శాతం మంది పక్షవాతాన్ని అశ్రద్ధ చేసి వికలాంగులుగా మారినట్లు న్యూరాలజీ వైద్యులు చెబుతున్నారు.

గుంటూరు మెడికల్: బ్రెయిన్ స్ట్రోక్ సమస్య యువయులను వేధిస్తోంది. పక్షవాతాన్ని వైద్య పరిభాషలో సెరిబ్రో వాస్క్యులర్ యాక్సిడెంట్ అని పిలుస్తారు. సోకిన వారిలో శరీరంలో ఏదో ఒక భాగం చచ్చుబడటం సాధారణంగా కనిపిస్తుంది. రక్తనాళాల్లో రక్తం కొంత ఒత్తిడితో ప్రవహిస్తూ ఉంటుంది. ఆ ఒత్తిడి బాగా పెరిగితే కొంత రక్తస్రావం జరుగుతుంది. మెదడులో రక్తస్రావం జరిగినా, రక్తం గూడు కట్టినా పక్షవాతానికి గురవుతారు.

కారణాలు...

మెదడుకి వెళ్లే రక్తనాళం గాని, మెదడులోని రక్తనాళం గాని పూడుకుపోవటం వలన రక్తసరఫరా ఆగిపోతే పక్షవాతం వస్తుంది. మెదడులో కణితులు, రక్తపోటు పెరగటం, పొగతాగటం, మద్యపానం వలన రక్తనాళాలు దెబ్బతిని పక్షవాతం వస్తుంది. రక్తంలో కొవ్వు పదార్థాలు(కొలెస్టరాల్) వలన, స్థూలకాయం వల్ల వ్యాధి వస్తుంది.

లక్షణాలు...

పక్షవాతం వచ్చినప్పుడు కొందరికి ఒకే వస్తువు రెండుగా కనబడుతుంది. మాట తడబడం, అయోమయంగా మాట్లాడటం, మింగుడు పడకపోవటం, నీరు కూడా సరిగా తాగలేకపోవటం, నీరు తాగబోతే ముక్కు వెంట కొంత బయటకు రావటం, కళ్లు తిరగటం, తల తిరగటం, అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, నడకలో తూలుడు, చేయి, మూతి ఒకవైపుకు ఒంకర పోవటం, దృష్టి మందగించటం, కాళ్లు, చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి అపస్మారక స్థితి(కోమా)లోకి వెళ్తాడు.

స్ట్రోక్ ... బీ ఫాస్ట్...



జీజీహెచ్‌లో పక్షవాతంతో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

జిల్లాలో బాధితుల సంఖ్య...

గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలోని స్ట్రోక్ యూనిట్‌లో 2023లో 311 మంది స్ట్రోక్ బాధితులు చికిత్స పొందారు. 2024లో 298, 2025 జనవరిలో 12 మంది, ఫిబ్రవరిలో 25 మంది, మార్చిలో 13 మంది, ఏప్రిల్‌లో 18 మంది, మేలో 15 మంది, జూన్‌లో 18 మంది ఆరు నెలల్లో 101 మంది పక్షవాతం బారిన పడి చికిత్స పొందారు. జిల్లాలో 20 న్యూరాలజీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. ప్రతిరోజూ ఒక న్యూరాలజీ వైద్యుడు ఇరువురు లేదా ముగ్గురు పక్షవాత బాధితులను కొత్తగా గుర్తించి వైద్య సేవలను అందిస్తున్నారు.

వ్యాధికి గురైతే ఇలా చేయాలి...



పక్షవాతం వచ్చిన వెంటనే గంట నుండి మూడు గంటల వ్యవధిలోనే న్యూరాలజీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. ఈ సమయాన్ని గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారు. త్వరగా కోలుకునే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితిల్లోనూ నాటు వైద్యం జోలికి వెళ్లవద్దు. పక్షవాతం వచ్చిన కాలూ, చేయీ చల్లబడి ఉంటాయి. అలాంటి భాగాలకు ఎట్టి పరిస్థితిల్లోనూ కాపడం పెట్టరాదు. రోగికి మాట పడిపోతుంది కాబట్టి తిరిగి మాట్లాడించే ప్రయత్నం చేయించాలి. ఆంత్రాలు వేసినా, పసర్లు మింగినా వ్యాధి తగ్గదు.

–డాక్టర్ చక్కా శివరామకృష్ణ, ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ నాయకులు, గుంటూరు

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పక్షవాతం వ్యాధి గ్రస్తులకు ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నాం. 24 గంటలు స్ట్రోక్ యూనిట్‌లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. వ్యాధి నిర్ధారణకు అవసరమైన ఎంఆర్ఐ, సీటీ స్కాన్, కలర్‌డాప్లర్ వైద్య పరికరాలు ఉన్నాయి. ప్రజలు వ్యాధిపై అవగాహన కల్గి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ముందస్తు జాగ్రత్తలు అవసరం



పక్షవాతం బారిన పడకుండా ఉండాలంటే ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ కనీసం అరగంట సేపు నడవటం, యోగా చేయటం చాలా మంచిది. ఉప్పు, చక్కెర, నూనె తగ్గించి వాడాలి. జీవనశైలిని మార్చుకోవాలి. రక్తపోటు, షుగర్ వ్యాధిని అదుపులో పెట్టుకోవాలి. స్మోకింగ్, మద్యం తాగడం చేయకూడదు. కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినకూడదు. స్థూలకాయం తగ్గించుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడకుండా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేసి జిల్లా అంతా ఉచితంగా బీపీ పరీక్షలు చేస్తున్నాం. బ్రెయిన్ స్ట్రోక్... బీ ఫాస్ట్ అనే నినాదంతో పక్షవాతంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ పి.విజయ, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు, గుంటూరు

క్లుప్తంగా

ఆపరేషన్ లేకుండానే గుండెకు చికిత్స

డాక్టర్ ఉప్పుటూరి అంజిత్

గుంటూరు మెడికల్: ఆపరేషన్‌తో పనిలేకుండానే గుండె రంధ్రాన్ని సరిచేసినట్లు గుంటూరు యాంజియోకేర్ హార్ట్ అండ్ వ్యాస్కులర్ ఇనిస్టిట్యూట్ అధినేత, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉప్పుటూరి అంజిత్ చెప్పారు. బుధవారం కొత్తపేటలోని అమృత హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన 25 ఏళ్ల పవన్‌సాయి పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఉండి బాధపడుతున్నట్లు చెప్పారు. ఆస్పత్రికి వచ్చిన కేవలం అరగంట సమయంలోనే పవన్‌సాయికి ఆపరేషన్ లేకుండా గుండెలోని రంధ్రాన్ని పూడ్చివేశామని వివరించారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో రోగి మెలకువగానే ఉండగా, అతడికి ఇష్టమైన మ్యూజిక్‌ను ప్లే చేసి పాటలు వింటూ ఉండగానే ఆట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ క్లోజర్ చేశామని తెలిపారు. ఎలాంటి కోత, కుట్టు లేదని చెప్పారు. ఈ సమస్యకు తప్పనిసరిగా గతంలో బైపాస్ సర్జరీ చేసేవారని, నేడు ఆపరేషన్‌తో పనిలేకుండా తమ వద్ద ఆధునిక సాంకేతికను తీసుకొచ్చమని వెల్లడించారు.

ఏఐ కార్డియో కేర్‌తో ఎంతో మేలు

డాక్టర్ పర్వతనేని నాగశ్రీ హరిత




గుంటూరు మెడికల్: గుండెజబ్బు రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్ కార్డియో కేర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను వినియోగిస్తున్నట్లు హాస్పిటల్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీ హరిత తెలిపారు. గుండె సంబంధ సమస్యలను పూర్తి కచ్చితత్వంతో విశ్లేషించడానికి, గుండె చికిత్స చేయడానికి ఏఐ సాంకేతికత ఉపయోగపడుతుందని వివరించారు. ఏఐ ఆధారిత చికిత్సా విధానాలు చికిత్స చేసే సమయంలో మందుల అవసరాన్ని తొలగిస్తాయని వెల్లడించారు.

జీజీహెచ్‌లో పిల్లలకు దుస్తులు పంపిణీ



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చిన్నారులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లికి చెందిన ఎస్.మారుతి వేణుగోపాల్ కుమార్తె ఎస్.నీరజ సాయంతో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భాష్యం విద్యాసంస్థల నిర్వాహకులు భాష్యం రామకృష్ణ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ చేతుల మీదుగా 350 మందికి విదేశాల నుంచి తెచ్చిన దుస్తులు అందజేశారు. తమ విద్యార్థి నీరజ, సే వాట్ స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి దాని ద్వారా విద్యార్థులకు ఉచితంగా వస్త్రాలు బహూకరించడం అభినందనీయమని భాష్యం రామకృష్ణ అన్నారు. జీజీహెచ్‌లో చిన్నారులకు వస్త్రాలు అందజేసిన నీరజను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు. సంస్థ ప్రతినిధి మారుతి వేణుగోపాల్ మాట్లాడుతూ 2024లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా తమ సేవా సంస్థ ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 7,350 మంది నాలుగేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశామని వివరించారు.

గంజాయి స్వాధీనం



నెహ్రూనగర్: నగర పరిధిలోని శివనాగరాజు కాలనీకి వెళ్లే మార్గంలో అన్నమయ్యనగర్ రెండో వీధిలో గంజాయి తీసుకుంటున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు గుంటూరు– 1 టౌన్ ఎక్సైజ్ సీఐ బి.లత తెలిపారు. గంజాయి ఉన్నట్లు సమాచారం మేరకు శివనాగరాజు కాలనీకి చెందిన బత్తుల గోపి, రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన కుంభ కార్తీకేయ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వీరి నుంచి 223 గ్రాముల స్వాధీనం చేసుకోవడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎండీ కె.షరీఫ్, పి.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పూర్ణచంద్రరరావు, వి.బసవేశ్వరరావు, బి.వీరాంజనేయులు, టి.చిన గోపి, టి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

గ్రీన్ గుంటూరు సాధనకు సహకరించాలి

మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరంలో మిషన్ గ్రీన్ ద్వారా ఐదు లక్షల మొక్కలు నాటడం ద్వారా గ్రీన్ గుంటూరు సాధనకు కృషి చేస్తున్నట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహ్మద్ నసీర్ తెలిపారు. బుధవారం కాకాని రోడ్, నందివెలుగు రోడ్, పొన్నూరు రోడ్డులలో పర్యటించి, నగరంలోకి ప్రవేశ మార్గాలైన ప్రధాన రోడ్లకు ఇరువైపులా, సెంట్రల్ డివైడర్లపై మొక్కలు నాటడం, ఆక్రమణల తొలగింపు చేపట్టాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. నగరంలో మిషన్ గ్రీన్ అమలుకు వార్డుల వారీగా మొక్కలు నాటడంతో పాటు ప్రభుత్వ స్థలాల్లో, పార్కులలో, వాకింగ్ ట్రాక్‌లలో, ప్రధాన, అంతర్గత రోడ్ల వెంబడి విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆనంతరం సంగడి గుంట ముస్లిం శ్మశాన వాటికను పరిశీలించి, అందులో వీధి లైట్లు, పిచ్చి మొక్కల తొలగింపు, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డుకు మీదకు ర్యాంప్‌లు రాకుండా చర్యలు

నెహ్రూనగర్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రెయినేజీ లైన్‌ను మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, వెంకటరమణ కాలనీ, రామిరెడ్డి నగర్, ఎన్జీఓ కాలనీ, శ్యామల నగర్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్డు కొలతలు తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

సార్వత్రిక సమ్మెతో మిర్చి అనుబంధ పరిశ్రమ బంద్



మిర్చి యార్డు కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు నళినికాంత్

లక్ష్మీపురం: కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపు నేపథ్యంలో గుంటూరు నగరంలోని మిర్చి పరిశ్రమ బుధవారం పూర్తిగా నిలిచి పోయింది. వేలాదిమంది మిర్చి కార్మికులు సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావడంతో కోల్డ్ స్టోరేజీలు, మిర్చి యార్డు, మిర్చి గూడాలు లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోయాయి. సమ్మె అనంతరం వందలాది మంది మిర్చి కార్మికులు మిర్చి యార్డు ప్రధాన గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కె.నళినికాంత్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనిని 10 గంటలకు పెంచిందని తెలిపారు. ముఠా కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని కార్మిక వర్గం కోరుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమాత్రం స్పందనలేదని విమర్శించారు. కార్యక్రమంలో కోల్డ్ స్టోరేజ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, గోవిందరావు నాయకులు కోటిబాబు, తిరుపతి రమణ, అప్పలనాయుడు, భాస్కర్, ఆదినారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

పోస్టల్ శాఖలో పూర్తి మద్దతు..

లక్ష్మీపురం: దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం, ఏఐజీఈఎస్‌యూ సంఘ నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. గుంటూరు అరండల్‌పేట హెడ్ పోస్టాఫీసు వద్ద అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం, పోస్ట్‌మెన్, ఎంటీఎస్, ఏఐజీడీఎస్‌యూ సంఘ సభ్యులు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత తపాల ఉద్యోగల సంఘం జాతీయ ఉప కార్యదర్శి సిహెచ్.విద్యాసాగర్ మాట్లాడుతూ కేంద్రం ఎన్‌పీఎస్, యూపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 8వ వేతన సంఘాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు వెంటనే చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి సిహెచ్.రాము, జీడీఎస్ జాతీయ ఉపకార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, జీడీఎస్ డివిజన్ కార్యదర్శి ఎస్.వి.రాఘవేంద్రరావు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఏఎన్‌యూ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు 2కే రన్, బ్లడ్ గ్రూప్ క్యాంప్, రక్తదాన శిబిరం, నేత్ర దాన ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ శాఖ ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ విద్యార్థి దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వి.రామారావు (సాక్ష్యం స్టేట్ సెక్రెటరీ) మాట్లాడుతూ సామాన్య విద్యార్థి స్థాయి నుంచి అసామాన్య పౌరునిగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నటువంటి విద్యార్థి సంఘం ఏబీవీపీ అని తెలిపారు. ఏఎన్‌యూ కామర్స్ విభాగాధిపతి ఆర్.శివరామ్ ప్రసాద్, ఏబీవీపీ రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్ మోహన్ రావు, రాష్ట్ర సోద్ కన్వీనర్ రమకాంత్, విశ్వవిద్యాలయాల కన్వీనర్ గంగాధర్ మాట్లాడారు. రాష్ట్ర ఎస్ ఎఫ్‌డీ కో కన్వీనర్ శివ గణేష్ పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు దీటుగా తీర్చిదిద్దాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో ఉద్యోగాలను సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలతో పాటు పరిశ్రమల అవసరాలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వృత్తిలో రాణించడం ఎలా అనే అంశంపై వారితో చర్చించారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ 2023–25 బ్యాచ్‌కు చెందిన 12 మంది విద్యార్థులు వివిధ ప్రముఖ ఆస్పత్రుల్లో ఫ్రంట్ డెస్క్ మేనేజర్, సర్వీస్ మేనేజర్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్‌గా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు వార్షిక వేతనం రూ.రెండు లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు ప్యాకేజీతో ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ కళ్యాణి, సహాయాచార్యులు బాజీబాబు, వేదవతి, షేక్ షబానా పర్వీన్, అభిలాష్, అనిత, రాజేశ్వరిదేవి, వెంకట కళ్యాణ్ పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ టాప్



సాయి రాఘవేంద్ర రెడ్డి, 4వ ర్యాంకు



మట్టుపల్లి గాయత్రి శ్రావ్య, 5వ ర్యాంకు



సీహెచ్ మైత్రిక, 6వ ర్యాంకు



బి.మహేశ్వర్, 6వ ర్యాంకు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఈనెల 8న ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో ర్యాంకుల ప్రభంజనం సృష్టించినట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. బుధవారం గుంటూరు బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో టాప్–10 ర్యాంకులనే ప్రకటించారని, వాటిలో తమ సంస్థకు చెందిన 11 మంది విద్యార్థులు ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు వివరించారు. పెనుగొండ సాయి రాఘవేంద్రరెడ్డి 4వ ర్యాంకు, మట్టుపల్లి గాయత్రి శ్రావ్య 5వ ర్యాంకు, మైత్రిక చొప్పర 6వ ర్యాంకు, బండిరెడ్డి మహేశ్వర్ 6వ ర్యాంకు, తోలేటి మనోజ్ఞ 8వ ర్యాంకు, పి.కౌశిక్ రాజ్ 8వ ర్యాంకు, అద్దేపల్లి విజిత 8వ ర్యాంకు, కొంద్రపు పూర్ణచందు 9వ ర్యాంకు, కురుబ దీక్షిత్ 9వ ర్యాంకు, సముద్రాల సాత్విక 10వ ర్యాంకు, తలాసి గౌతమ్‌కుమార్ 10వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఒకే విధమైన మార్కులు సాధించిన విద్యార్థులకు ఒకే విధమైన ర్యాంకులు కేటాయించినట్లు తెలిపారు. అఖిల భారతస్థాయిలో ప్రకటించిన టాప్–10లో తమ విద్యార్థులే 11 ర్యాంకులను కైవసం చేసుకోడం అసాధారణమైన విషయమన్నారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి

కమిషనర్ పులి శ్రీనివాసులు



డాక్టర్ అమృతంకు జ్ఞాపిక అందజేస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: పారదర్శక ఎన్నికలకు, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ)ల పాత్ర కీలకమని, బీఎల్ఓలు ఎన్నికల నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గుంటూరు తూర్పు 95 నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడిఈఎం) ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ 94, తూర్పు 95 నియోజకవర్గాల బీఎల్ఓలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. విధుల్లో భాగంగా అందే ప్రతి క్లెయిమ్‌కు తప్పనిసరిగా ఫైల్ నిర్వహించాలని, అందులో సదరు క్లెయిమ్ సపోర్ట్ డాక్యుమెంట్స్, పబ్లికేషన్ ఫారాలు, నోటీసు, నోటీసు ఇచ్చినట్లు ఎకనాలెడ్జ్మెంట్, బీఎల్ఓ రిమార్క్స్, ఆమోదించినా, రిజెక్ట్ చేసినా ప్రొసీడింగ్స్, ప్రొసీడింగ్స్ దరఖాస్తుదారుకి అందినట్లు ఎకనాలెడ్జ్మెంట్ వంటివి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అనంతరం బుధవారం శిక్షణ అనంతరం బీఎల్ఓలకు పెట్టిన పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ 94 నియోజకవర్గ ఈఆర్ఓ, నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఈఆర్ఓలు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, రాంబాబు, సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లనున్న సీఎంహెచ్‌ఓకు సన్మానం

నెహ్రూనగర్: గుంటూరు నగర చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆన్ హెల్త్(సీఎంఓహెచ్)గా డాక్టర్ అమృతం అనతికాలంలోనే అందరి మన్ననలను పొందారని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఏలూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా పదోన్నతి పొందిన డాక్టర్ అమృతం బుధవారం గుంటూరు నగర సీఎంఓహెచ్‌గా రిలీవ్ అవుతున్న సందర్భంగా నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చేపట్టిన పలు సంస్కరణలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో డాక్టర్ అమృతం సమర్థంగా విధులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఎంహెచ్‌ఓలు (ఇన్‌చార్జి) రామారావు, సోమశేఖర్ పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకోవడం అభినందనీయం



వృద్ధునికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, ట్రస్ట్ నిర్వాహకులు

నగరంపాలెం: సమాజంలోని పేద, బలహీన వర్గాలకు మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనివ్వడం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. కాకాని రోడ్డులోని ఓ కన్వెన్షన్‌లో బుధవారం రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామకృష్ణయ్య జన్మదినం సందర్భంగా 300 మంది పేద వృద్ధులకు రూ.400 చొప్పున మూడు నెలల పెన్షన్‌ను ఎమ్మెల్యే మాధవి అందించారు. ఆమె మాట్లాడుతూ వ్యాపార ధర్మాలను నిర్వర్తిస్తున్న ఆర్యవైశ్యులు తాము ఆర్జించిన లాభాల్లో కొంత సేవా కార్యక్రమాలకు నిర్వర్తించడం ప్రసంశనీయమని అన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు రామకృష్ణయ్య మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వృద్ధాప్య పెన్షన్లకు రూ.60 లక్షలు వరకు అందించినట్లు చెప్పారు. పింఛన్లతోపాటు వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు మద్దు జయలక్ష్మి, భావన్నారాయణ, డాక్టర్ దేవి వైష్ణవి, శ్రీమన్నారాయణ హర్షిత, సత్యవతి, నంబూరి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథుని గురుపూజోత్సవం



సాయినాథునికి ప్రత్యేక పూజలు



గ్రామోత్సవంలో రథం లాగుతున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా బుధవారం గురు పూజోత్సవం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం కోలాటాలు, తప్పెట్లు తాళాలు, వేషధారణలతో పుర వీధుల్లో కొనసాగింది. పరిసర ప్రాంతాల్లోని భక్తులు సాయినాథుని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవాది బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులను యడ్లపాటి అశోక్‌కుమార్, స్వరూపరాణి దంపతులు పాదపూజ చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలపాటి మాధవి, కార్పొరేటర్ కోటేశ్వరరావు, బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ సభ్యులు, ఆలయ గౌరవాధ్యక్షులు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, మొవ్వ సంజీవరావు, ఆవుల అప్పారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా శోభాయాత్ర

నగరంపాలెం: స్థానిక వికాస్‌నగర్ 11వ వీధిలోని షిరిడి సాయి మందిర్ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సాయిబాబా శోభాయాత్ర నిర్వహించారు. సాయిబాబా ఉత్సవ విగ్రహంతో నిర్వాహకులు పూర్ణచంద్రరావు దంపతులు, ఆలయ పాలక మండలి సభ్యులు అభిషేక కళాశాలతో, తిరువీధుల్లో మేళతాళాల మధ్య శోభాయాత్ర కొనసాగింది.